ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 **తిరుపతి** జిల్లా వార్తలు

సోమవారం 22 జనవరి 2024



చుక్కల్లో రామయ్య

అయోధ్యలో సోమవారం బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రసిద్ధ చిత్రకారుడు గిన్నె సాగర్ సిరా చుక్కలతో రూపొందించిన శ్రీరాముడి చిత్రం ఇది. రోటరింగ్ పెన్‌తో లక్షలాది రంగు రంగుల సిరా చుక్కలు అద్దుతూ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. బిందు చిత్రకారుడిగా ప్రసిద్ధుడైన సాగర్.. తిరుపతిలోని టీటీడీ సంప్రదాయ శిల్ప కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

పుంగనూరులో సీను మారిందా?

- భయపడటం నుంచి ఎదురొడ్డే స్థాయికి టీడీపీ శ్రేణులు

మంత్రి పెద్దిరెడ్డి ఇలాకాలో సీను మారిందా? భయపడటం నుంచి ఎదురొడ్డే స్థాయికి టీడీపీ శ్రేణులు వచ్చారా? మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం చౌడేపల్లెలో వాహనంలో వెళ్తుండగా.. రోడ్డు పక్కన టీడీపీ కార్యకర్తల చేతిలో రెపరెపలాడిన పసుపు జెండాలను చూస్తే.. ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తుంది.

పుంగనూరు నియోజకవర్గంలో పసుపు జెండాలు కనిపించరాదని సైకిల్ యాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తల బట్టలు తీయించి కొన్ని నెలల కిందట వైసీపీ నేత దాష్టీకాన్ని ప్రదర్శించారు.

గతేడాది చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా పుంగనూరులో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జరిగిన గొడవ ఉద్రిక్తతకు దారితీయడం, పోలీసు వాహనాల దహనం, రాళ్లు, కర్రలు, బాటిళ్లతో దాడులు.. లాఠీచార్జీ నేపథ్యంలో దాదాపు 500 మందిపై పోలీసులు కేసులు పెట్టారు.

.. ఇలా పుంగనూరులో విపక్షాలు ఏ కార్యక్రమం చేపట్టినా.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించినా పోలీసులు అడ్డుకోవడం అలవాటుగా మారింది. భారీగా కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకూ గురిచేస్తున్నారు. ఈ క్రమంలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కొంతకాలంగా 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం చౌడేపల్లెలో చల్లాబాబు పర్యటన నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. చల్లా బాబు రొంపిచెర్ల నుంచి వస్తుండగా.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరుకు వెళుతున్నారని, కొంతసేపు రోడ్డుపైకి రాకుండా చౌడేపల్లె బయటే ఉండి తర్వాత మీ కార్యక్రమం చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఆయన సంయమనం పాటించి గ్రామసమీపంలోనే ఉన్నారు. చల్లా బాబుకు స్వాగతం పలికేందుకు బళ్లారి డ్రమ్స్ వాయిస్తూ టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పసుపు జెండాలతో చౌడేపల్లె బస్టాండుకు చేరుకున్నారు. వీరిని దూరంగా పోవాలని పోలీసులు చెప్పినా వినలేదు. తాము ఎందుకు పోవాలంటూ ఎదురుతిరిగారు. తాము తగ్గేదేలేదని, పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయమంటూ జేజేలు కొడుతూ భారీగా చేరుకున్నారు. మంత్రి వచ్చే సమయం దగ్గరపడటంతో పోలీసులు గొడవ చేయకుండా ఉండాలని కోరారు. చల్లా బాబు, మండలాధ్యక్షులు చిట్టి అన్న జిందాబాద్ అంటూ టీడీపీ శ్రేణులు నినాదాలు చేశారు. అదే సమయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్ చౌడేపల్లె బస్టాండుకు చేరుకుంది. అయినా, టీడీపీ కార్యకర్తలు ఆగలేదు. పుంగనూరులో టీడీపీని గెలిపిస్తామని నినాదాలు చేస్తూ ఈలలు వేస్తూ, బళ్లారి డ్రమ్స్ వాయించారు. ఇలా కొన్నేళ్ల తర్వాత మొదటిసారి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా, ఆయన వెళ్లే సమయంలో రోడ్డుపై టీడీపీ కార్యకర్తలు వచ్చారు. తిరుగుబాటు మొదలైందని ఎన్నికల ముందు కార్యకర్తలు సంకేతం ఇచ్చినట్లు అయింది. రోడ్డుపై ధైర్యంగా టీడీపీ శ్రేణులు నిలబడ్డారు.

\- పుంగనూరు



మంత్రి పెద్దిరెడ్డి వాహనం వెళ్తుండగా.. పసుపు జెండాలను రెపరెపలాడిస్తున్న టీడీపీ శ్రేణులు





తిరుమల నాకు ఇష్టమైన ప్రదేశం

తిరుమల తనకు ఎంతో ఇష్టమైన ప్రదేశమని సినీ హీరోయిన్ శ్రియ చెప్పారు. శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం బయట మీడియాతో మాట్లాడారు.అలాగే మిస్ ఎర్త్ ఇండియా-2019 తేజస్విని మనోజ్ఞ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో నేడు రామాయణ పారాయణం

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేదపాఠశాలలో సోమవారం సంపూర్ణ రామాయణ పారాయణం కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనుంది. అయోధ్యలో సోమవారం రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రామాయణ పారాయణం నిర్వహించనున్నారు.అయోధ్యలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ తమిళం, కన్నడ, హిందీ ఛానళ్లతో పాటు యూట్యూబ్ తెలుగు ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో తిరుమలలోని కళ్యాణోత్సవం అనంతరం 12 గంటల నుంచి అయోధ్య కార్యక్రమాలు ప్రత్యక్షప్రసారం కానున్నాయి.




ప్లాట్లు వేసిన అనాధీనం భూమి

రూ.3కోట్ల అనాధీనం భూమి స్వాహా!

- ఆన్‌లైన్లో గ్రామ కంఠంగా మార్చేసి ఆపై లేఅవుట్ వేసి విక్రయాలు
- దర్జాగా ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు
- ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రంగం సిద్ధం

దక్షిణ కాశీగా పేరుబడ్డ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం చివరకు భూదందాలకు మారుపేరుగా మారిపోయింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులు చెరబట్టేస్తున్నారు.అవినీతి అధికారులు వీరికి కావాల్సినంత సహకారం అందిస్తున్నారు.తాజాగా తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో రూ.మూడు కోట్ల విలువైన అనాధీనం భూమిని ముక్కలు చేసి అమ్మేశారు. అధికారులు ఎంతకు తెగించారంటే...ఫేర్ అడంగల్‌లో అనాధీనంగా ఉన్న భూమిని ఆన్‌లైన్లో గ్రామకంఠంగా మార్చేశారు. అధికార పార్టీ ముఖ్య నేత బినామీ ఒకరు దర్జాగా లే అవుట్ వేసి విక్రయిస్తున్న ప్లాట్లకు బహిరంగంగా ఎంజాయ్ మెంటు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. రేపో మాపో రిజిస్ట్రేషను చేసేందుకూ రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.


తిరుపతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తొట్టంబేడు శ్రీకాళహస్తి పట్టణానికి ఆనుకుని ఉంది. తొట్టంబేడు రెవిన్యూ పరిధిలోని రామచంద్రా పురం,సాయినగర్, ఎల్‌ఐసీ కాలనీ, ఈదులగుంట ప్రాంతాలను శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో విలీనం చేశారు. పట్టణం విస్తరిస్తుండడంతో ఈ ప్రాంతాల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.ఇదే అదునుగా అక్రమార్కులు దోచేస్తున్నారు. రెండేళ్ల క్రితం తొట్టంబేడు తహసీల్దారు భూముల రికార్డులను తారుమారు చేసిన విషయంలో పట్టుబడి సస్పెండయ్యారు. ఆ తరువాత ఓ ఇంచార్జి అధికారిని ఇక్కడ నియమించుకున్నారు. అయితే ఇక్కడ పరిస్థితులు మారకపోగా మరింత దారుణంగా తయార య్యాయి.రాజీవ్‌నగర్, టిడ్కో గృహాలు,జగనన్న కాలనీ రామచంద్రాపురం పరిధిలోనే ఉండడంతో భూముల ధరలకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. పలు ప్రైవేట్ లేఔట్లు కూడా రామచంద్రాపురంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఈ గ్రామంపై అక్రమార్కులు కన్నేశారు. అధికారులు వారితో చేతులు కలిపి భారీ కుంభకోణానికి తెరతీశారు.ఇక్కడ భారీగా అనాధీన భూములున్నాయి. వాటిలో మొదట సర్వేనెంబర్ 90-1లోని 1.48ఎకరాల భూమిని కబళించేందుకు స్కెచ్ వేశారు. ముందుగానే ఫేర్ అడంగల్‌లో అనాధీనంగా ఉన్న భూమిని ఆన్‌లైన్లో గ్రామకంఠంగా మార్చేశారు.శ్రీకాళహస్తి నియోజక వర్గ అధికార పార్టీ ముఖ్య నేత బినామీ అయిన ద్విచక్ర వాహన షోరూం యజమాని రంగంలోకి దిగి ఆ భూమిలో 38 ప్లాట్లతో లేఔట్ వేశారు.అధికారుల అండతో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ చేస్తూ రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ద్వారా అమ్మేశారు.మార్కెటు ధర ప్రకారం రూ.15 లక్షల విలువ చేసే ప్లాటు సగం ధరకే లభించడం... పైగా రిజిస్ట్రేషన్ కూడా చేస్తుండడంతో జనాలు ఎగబడి కొన్నారు. ఈ కుంభకోణం వెలుగులోకి రాకముందే ఒకేసారి గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ముఖ్య నేత అండతో ఇందులో అన్నీ తానై వ్యవహరిస్తున్న అధికారి తీరు చర్చనీయాంశమవుతోంది.



ఫేర్ అడంగల్‌లో అనాధీనంగా ఉన్న రికార్డు



అధికారులు ఇచ్చిన ఎంజాయ్‌మెంట్ పత్రం



అక్రమ లేవుట్ మ్యాప్



ఆన్‌లైన్‌లో గ్రామకంఠంగా మార్పు చేసిన రికార్డు

సూళ్లూరుపేట టిక్కెట్ సంజీవయ్యకే

ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటన

వైసీపీ యాత్రకు అసమ్మతి నాయకుల గైర్హాజరు

నాయుడుపేట, జనవరి 21 : సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ టికెట్ సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. నాయుడుపేటలో ఆదివారం నిర్వహించిన వైసీపీ సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీలో ఎవరైనా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడాలని సూచించారు.ఈ విషయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలుంటాయని హెచ్చరించారు.కాగా సామాజిక సాధికారిక యాత్రకు ఎమ్మెల్యే సంజీవయ్యను వ్యతిరేకిస్తున్న నాయకులెవరూ హాజరు కాలేదు.ఈ నేపథ్యంలో వారంతా ఎలాస్పందిస్తారో అన్న చర్చ జనంలో నడుస్తోంది.

శ్రీకాళహస్తిలో టెన్షన్...టెన్షన్

టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వైసీపీ నేతలు

పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదులు...కేసుల నమోదు

శ్రీకాళహస్తి, జనవరి 21: టీడీపీ ప్రచార రథాన్ని వైసీపీ నేతలు అడ్డుకున్న ఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి జరిగింది.శ్రీరామ్ నగర్ కాలనీలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితా రెడ్డి ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రచార రథం నుంచి సైకో పోవాలి సైకిల్ రావాలి అన్న పాటలు విన్పిస్తుండగా వైసీపీ ఏర్పేడు ఇంచార్జి కిషోర్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు మోహన్ రెడ్డి, అమ్మపాలేనికి చెందిన మురళి రెడ్డి మరికొందరితో కలిసి టీడీపీ రథాన్ని అడ్డుకున్నారు. సైకో పాటను నిలిపివేయాలనడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమీపంలోనే ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి వారి ప్రచార రథాన్ని ఘటనా స్థలానికి చేర్చి టీడీపీ ప్రచార రథానికి ముందుగా సాగారు. మళ్లీ ఇరు వర్గాల మధ్య మాట మాటా పెరిగింది.టీడీపీ నాయకుడు కన్నలి ప్రతాప్ రెడ్డి సర్దిచెప్పారు.తర్వాత టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వారిలో ఒక్కరైన మురళి రెడ్డి ఊరందూరుకు చేరుకొని బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పినట్లు సమాచారం.కాగా ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటన ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో వైసీపీలో అంతర్మథనం జరిగినట్లు సమాచారం.ఆదివారం మధ్యాహ్నం మురళి రెడ్డి తమపై దాడి జరిగిందంటూ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. టీడీపీ నాయకులు తనను కిడ్నాప్ చేసి శనివారం అర్ధరాత్రి ఊరందూరుకు తీసుకువెళ్లి గన్ తలపై పెట్టి చంపేస్తామని బెదిరించినట్లు ఆరోపిస్తూ శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.చివరకు టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వైసీపీ నాయకుడు మురళి ఫిర్యాదు మేరకు కిడ్నాప్,దాడి కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ ప్రచార రథం డ్రైవర్ మోహన్ తనపై వైసీపీ నాయకులు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళి అడ్డుకొని దాడి చేయడంతో పాటు తనని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ ముగ్గురి మీదా అట్రాసిటీ, దాడి కేసులు నమోదు చేశారు.

మహిళల స్వేచ్ఛకు భరోసా ఏదీ: టీడీపీ

శ్రీకాళహస్తిలో మహిళల స్వేచ్ఛకు భరోసా లేదని సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకోవడంపై ఆమె తన ఆవేదనను వీడియోలో పొందుపరిచి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంలోకి తెచ్చారు.శ్రీరామ్ నగర్ కాలనీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకుంటుంటే వైసీపీ కార్యాలయ సమీపంలో మద్యం సేవించిన ఆ పార్టీ నేతలు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళిరెడ్డి దుర్భాషలాడుతూ అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బొజ్జల సుధీర్‌రెడ్డి ఏర్పేడు మండలం ఎండీపుత్తూరులో జరిగిన మీడియా సమావేశంలో స్పందించారు.తానెప్పుడూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల జోలికి కానీ ఆయన సోదరుడు కిషోర్‌రెడ్డి జోలికి కానీ పోలేదన్నారు. అయితే వైసీపీ నేతలు తన కుటుంబంపై దాడి చేయడానికి ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. తన కుటుంబం జోలికి వస్తే తాట తీస్తానని హెచ్చరించారు.



వైసీపీ నేతలపై సీఐ అంజూయాదవ్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

దొంగ ఓటర్ల నమోదు కుట్రపై చర్యలు తీసుకోండి

పోలీసులకు పులివర్తి నాని ఫిర్యాదు

పాకాల, జనవరి 21 : ఓటర్ల జాబితాలో బోగస్ ఓటర్లను చేర్పించిన కుట్రదారులపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆదివారం పాకాల, చంద్రగిరి పోలీసులకు ఆయన ఫిర్యాదులందజేశారు. రాబోయే ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ అభ్యర్థి, ఆయన అనుచరులు ఎన్నికల అధికారులతో కలిసి బోగస్ ఓటర్లను నమోదు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల అధికారుల లాగిన్ వినియోగించి కుట్రలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓటర్ల నమోదుకు ఫాం 6లో నమోదు చేసుకుంటే సంబంధిత బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను చేర్పించాల్సి వుందన్నారు. అయితే చాలామంది బీఎల్వోలు వైసీపీ శ్రేణులతో కలిసి గుడ్డిగా నకిలీ ఓటర్లను నిజమైనవిగా ధ్రువీకరిస్తున్నారని ఆరోపించారు.30వేల నుంచి 40 వేల ఓట్లు ఇలా చేర్పించారని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా విచారణ జరపలేదన్నారు. మూడేళ్ల క్రితం జరిగిన తిరుపతి లోకసభ ఉప ఎన్నికల సమయంలో చంద్రగిరి నియోజక వర్గ పరిధిలో వేలాది బోగస్ ఓటర్లను చేర్పించారన్నారు. ఇలాంటి అక్రమాలతోనే ఎంపీగా గురుమూర్తి విజయం సాధ్యమయిందన్నారు. మొబైల్ నెంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ ఓటీపీలు లేకుండా నమోదు చేస్తున్నారంటే ఎన్నికల అధికారులు వీరికి సహకరిస్తున్నారని తెలుస్తోందన్నారు. ఎన్నికల అధికారులైన ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్వోలు బాధ్యతారహితంగా అక్రమాలకు సహకరిస్తున్నారని అనుమానిస్తున్నామన్నారు. ఈసీ వెబ్‌సైట్‌ను దుర్వినియోగం చేయడంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



పాకాల పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాని

ఎన్నికల అధికారుల లాగిన్లపై
ఫోరెన్సిక్ విచారణ జరపాలి



భాకరాపేట ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న సుధా రెడ్డి

భాకరాపేట/ఎర్రావారిపాలెం, జనవరి 21: ఎన్నికల అధికారుల లాగిన్లపై ఫోరెన్సిక్ విచారణ జరపాలని టీడీపీ నాయకురాలు సుధారెడ్డి ఆదివారం భాకరాపేట, ఎర్రావారిపాలెం పోలీసులను కోరారు. చంద్రగిరి నియోజవర్గంలోని అన్ని మండలాల్లో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భారీగా దొంగ ఓట్లు నమోదైనట్లు తమ పరిశీలనలో తేలిందని ఆమె తెలిపారు. క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే ఆమోదించాల్సిన ఎన్నికల అధికారులు వైసీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు గంపగుత్తగా వాటిని ఆమోదించారని ఆమె ఆరోపించారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సందర్భంగా డౌన్‌లోడ్ అయిన సుమారు 35 వేల దొంగ ఓటరు ఐడీల సాయంతో చంద్రగిరి నియోజవర్గంలో కొత్త ఓటర్ల చేర్పు చేశారన్నారు. ఎన్నికల అధికారుల అధికారిక లాగిన్‌లను ఎవరెవరు, ఎక్కడెక్కడ వినియోగించారో కనిపెట్టేందుకు వాటిపై ఫోరెన్సిక్ విచారణ కోరుతున్నామన్నారు. ఈ మేరకు ఆమె భాకరాపేట ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. అలాగే ఎర్రావారిపాలెం మండలంలో దొంగ ఓట్ల చేర్పులు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగింపుపై పులివర్తి సుధారెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఎస్ఐ ఈశ్వరయ్యకు ఫిర్యాదు చేశారు. ఓటరు నమోదులో బూత్ స్థాయి అధికారులు, వారి పర్యవేక్షకులు, డీటీలు రాజకీయ నాయకులకు తలొగ్గి దొంగ ఓట్లు నమోదు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగింపు వంటి అవకతవకలను సరిచేయాలని తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, కార్యదర్శి మహేష్. నాయుడు, విశ్వనాథరెడ్డి, అమరనాథ రెడ్డి, వెంకటశివరామిరెడ్డి, రాజశేఖర్ నాయుడు, అశోక్ రెడ్డి, దేవి, దేశిరెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

124 మందికి కంటి పరీక్షలు

పాకాల, జనవరి 21: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి వైద్య బృందం 124 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 26 మందిని శంకర్ నేత్రాలయానికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు విజయబాబు, ప్రతినిధులు ఆర్వీ ప్రసాద్, కుప్పుస్వామి నాయుడు, దొరస్వామి నాయుడు, తులసీరామన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డేవిడ్ రవిచంద్ర



పాకాల, జనవరి 21: చిత్తూరు పార్లమెంటు టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాకాలకు చెందిన డేవిడ్ రవిచంద్ర నియమితులయ్యారు. ఈ సందర్భం డేవిడ్ రవిచంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికలలో విజయం సాధించడానికి కష్టపడి పనిచేస్తామన్నారు.

గ్రామస్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న బెల్లంకొండ మురళి

భాకరాపేట, జనవరి 21: గ్రామస్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లెలో ఆదివారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదనమోహన, మోహన్ రెడ్డి, మునస్వామి నాయుడు, చంద్రశేఖర్, మౌలాలి, శంకర, చలపతి, కుమారస్వామి రెడ్డి, మున్నా సాహెబ్, సుబ్రహ్మణ్యం, మల్లికార్జునరెడ్డి, జేడీ బాలాజీ, బాలసుబ్రహ్మణ్యం, వెంకటరామయ్య, ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కళ్యాణం

భాకరాపేట, జనవరి 21: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట జరగనున్న నేపథ్యంలో సోమవారం చిన్నగొట్టిగల్లులో సీతారాములు, మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణోత్సవం జరుగుతుందని కోదండరామస్వామి ప్రధాన అర్చకులు రామకవచం వాసుదేవ శర్మ తెలిపారు. ఉదయం 6 గంటలకు జంగావాండ్లపల్లె నుంచి గ్రామోత్సవం ప్రారంభమై వలసారెడ్డిగారిపల్లె వరకు జరుగుతుందన్నారు.

తొండవాడలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు

చంద్రగిరి, జనవరి 21: చంద్రగిరి మండలం, తొండవాడ పంచాయతీలో రూ.3 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి తెలిపారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కోటి రూపాయలు నిధులు ఇచ్చారని, దీంతో పంచాయతీలో మరింత అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



చంద్రగిరి, జనవరి 21: చంద్రగిరి మండలం యల్లంపల్లి సమీపంలో ఏనుగులు పంట పొలాలపై ధ్వంసం చేశాయి. యల్లంపల్లికి చెందిన వినోద్, మునికృష్ణయాదవ్, నాగిరెడ్డి, వాసునాయుడు, గంగాధరానికి సంబంధించిన వరి, అరటి, మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. పొలాలకు ఉన్న ఫెన్సింగ్‌ను కూడా ధ్వంసం చేశాయి. యల్లంపల్లి అటవీ ప్రాంతానికి సమీపంలో మూలపల్లి చెరువు ఉండటంతో తాగునీటి కోసం రాత్రి సమయంలో ఏనుగులు గుంపులుగా వస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి చెరువు సమీపంలో ఉన్న పంటలను ఏనుగులు ధ్వంసం చేసాయి. అటవీ అధికారులు, రైతులు మూడు రోజులుగా ఏనుగులు రాకుండా రాత్రి సమయాల్లో బాణా సంచా కాలుస్తూ, డప్పులు వాయిస్తున్నారు.

నృత్యం అదరహో



నృత్యంచేస్తున్న చిన్నారులు

తిరుచానూరు, జనవరి 21: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అదరహో అనేలా సాగింది. కర్నాటక హుబ్లీకి చెందిన జ్యోతి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమికీ చెందిన విద్యార్థులు పూర్వి, స్వాతి, త్రిష, అన్వి, శృతి, ఐశ్వర్య, శర్వాణి, చిన్నయి, హరి నాగిరెడ్డి, దేదీప్య పలు అన్నమయ్య కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

టీడీపీ సీనియర్ నేత హఠాన్మరణం

తిరుచానూరు,జనవరి21: యోగిమల్లవరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, శివాలయం మాజీ చైర్మన్ పుంజలి సుబ్రహ్మణ్యం ఆదివారం హఠాన్మరణం చెందారు. టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి యోగిమల్లవరం చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్

పాకాల, జనవరి 21: ఆనందగిరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, మొగరాల మాజీ సర్పంచ్ ఆర్.ఆనందచౌదరి ఆదివారం పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. కృష్ణాపురంలోని ఆయన ఇంటి వద్ద పులివర్తి నాని పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆయన్ను ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో వున్న ఈయన గత ఎన్నికల అనంతరం వైసీపీలో చేరారు. తిరిగి సొంత గూటికి చేరారు. అలాగే మొగరాల పెద్ద హరిజనవాడకు చెందిన వైసీపీ నాయకుడు చిట్టిబాబు తన అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం దామలచెరువులో పులివర్తి నాని పర్యటించారు. ఈ సందర్భంగా తెలుగు తమ్ముళ్లు, జనసేన నాయకులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు.



మాతృభాషలో చదవడం మంచిది



సమావేశంలో మాట్లాడుతున్న మేడసాని మోహన్



స్టాల్స్‌లో పుస్తకాలను కొనుగోలు చేస్తున్న సాహితీప్రియులు, విద్యార్థులు

తిరుపతి (కల్చరల్), జనవరి 21: మాతృభాషలో చదవడం వల్ల చెడు కంటే మంచే ఎక్కువగా జరుగుతుందని, అమ్మ భాషలోని అభినివేశం ఇతర భాషలను నేర్చుకోవడానికి ఉపకరిస్తుందని పంచ సహస్రావధాని మేడసాని మోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం తిరుపతి పుస్తక ప్రదర్శనలోని వావిళ్ల రామస్వామి శాస్త్రి సాహిత్య వేదిక నుంచి ఆయన మాట్లాడుతూ పద్యం తెలుగు వారికి ప్రత్యేకమైన సొత్తుగా పేర్కొన్నారు. ఇతర భాషలు నేర్చుకోవడం అనివార్యమే అయినా సొంత భాషను విడిచిపెట్టాల్సిన అవసరం లేదన్నారు. అలాగే వావిళ్ల వారి సాహితీసేవ మరువలేనిదని, వారి ముద్రణలోనే అనేక తెలుగు ప్రబంధాలు, గ్రంథాలు తెలుగు వారికి అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేసుకున్నారు. స్విమ్స్ పూర్వ సంచాలకులు డాక్టర్ వెంగమ్మ, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర్, భారతీయ విద్యా భవన్ సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ రాజు, ఆచార్య దక్షిణామూర్తి శర్మ, తోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సాహితీప్రియులు పాల్గొన్నారు. కాగా సాయంత్రం 5 నుంచి 6.30 వరకు భారతీయ విద్యాభవన్, శ్రీవేంకటేశ్వర విద్యాలయ విద్యార్థులు సంగీత విభావరి ఆహూతులను అలరించింది. మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాల విద్యార్థులకు భాస్కర శతకం పద్య పోటీలు జరిగాయి.

బుక్ స్టాల్స్ వద్ద రద్దీ

తిరుపతి పుస్తక ప్రదర్శన రెండవ రోజు ఆదివారం కావడంతో సందడి కనిపించింది. ఉదయం నుంచే పిల్లలు, పెద్దలు పుస్తకాల దుకాణాల ముందు చేరడంతో రద్దీ కనిపించింది. ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాసం, కాల్పనిక సాహిత్యం వంటి అన్ని రకాల పుస్తకాలను ఆసక్తిగా కొనడం కనిపించింది.

తిరుమలకు కాలినడకన తమిళ భక్తులు

- మేల్‌మరవత్తూరుకు తెలుగు భక్తులు

రామచంద్రాపురం, జనవరి 21: తమిళనాడు రాష్ట్రం షోలింగర్ ప్రాంతం నుంచి 150 మంది భక్తులు తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్లారు. వీరు అక్కడి నుంచి శుక్రవారం బయలుదేరి రాయలుచెరువు కట్ట భవానీ నీలకంఠేశ్వరాలయం వద్దకు ఆదివారం ఉదయం చేరుకున్నారు. కొంత విశ్రాంతి తరువాత కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. అలాగే మండలంలోని రాయలచెరువుపేట గ్రామానికి చెందిన 130మంది ఓంశక్తి మాల ధరించారు. వీరంతా ఆదివారం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం వద్ద ఇరుముడి కట్టుకుని మేల్‌మరవత్తూరు అమ్మవారి దర్శనానికి వెళ్లారు. మండలంలో ఈ యేడాది ఎన్నడూ లేనంతగా పలు గ్రామాల నుంచి దాదాపు 5వేలమంది భక్తులు ఓంశక్తి మాల ధరించి మేల్‌మర వత్తూరు ఆదిపరాశక్తి ఆలయానికి వెళ్లారు.



ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ, తిరుమలకు కాలినడకన వెళుతున్న తమిళ భక్తులు



తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో అవకతవకలపై
మరో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21: తిరుపతి ఎంపీ ఉప ఎన్నిక సందర్భంగా 2021లో చోటుచేసుకున్న దొంగ ఓట్ల వ్యవహారానికి సంబంధించి మరో కేసు నమోదైంది.తిరుపతిలోని సుందరయ్య నగర్, క్రాంతి నగర్ ప్రాంతాలకు చెందిన ఆరుగురికి చెందిన ఓటరు కార్డులు అసలువేనా,నకిలీవా తేల్చాలని తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత శనివారం రాత్రి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.సీఐ జయనాయక్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.ఉప ఎన్నిక సమయంలో తిరుపతిలో పెద్దఎత్తున దొంగ ఓట్లు పోలయ్యాయి.నాటి ఎన్నికల ఈఆర్వో గిరీషా లాగిన్‌ను దుర్వినియోగంచేసి 34వేల ఓటరు కార్డులను డౌన్‌లోడ్‌చేసి వివరాలను, ఫొటోలను తారుమారుచేసి నకిలీ ఓటరు కార్డులను తయారు చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులు బయటి ప్రాంతాలనుంచి దొంగ ఓటర్లను తిరుపతికి తరలించి పెద్దఎత్తున దొంగ ఓట్లను వేయించారు. ప్రతిపక్షాల నేతలు ఈ సందర్భంగా పలువురు దొంగ ఓటర్లను గుర్తించి పోలీసులకు అప్పగించారు.అయితే పోలీసులు చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించారు. దీంతో ప్రతిపక్షాలు దొంగ ఓటర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పోలీసులు ఈ ఫిర్యాదులపై చర్యలు తీసుకోలేదు. దీంతో టీడీపీ నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దొంగ ఓటర్లకు సంబంధించి వీడియోలు, నకిలీ ఓటరు కార్డులు, ఇతర ఆధారాలను ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల కమిషన్ ఈ ఫిర్యాదులపై విచారించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించడంతో శనివారం కమిషనర్ హరిత వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.స్థానిక సుందరయ్య నగర్‌కు చెందిన లక్ష్మమ్మ, కోమాంగి, కోమల, మల్లిక, శాంతి, క్రాంతినగర్‌కు చెందిన కుమారి అసలైన ఓటర్లేనా, అలాగే వారి కార్డులు సరైనవేనా నిగ్గు తేల్చాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జయనాయక్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులు, వారి ఓటరు కార్డులు అసలువో,నకిలీవో ప్రస్తుతానికి తెలియనందున గుర్తు తెలియని వ్యక్తుల కింద కేసు నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత ఆయా వ్యక్తులతో ఓటరు కార్డులను సరిపోల్చనున్నారు. ఒకవేళ ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులు నిజంగానే ఉంటే.. వారి ఓటరు కార్డులను కూడా పోలీసులు సరిపోల్చనున్నారు. ఒకవేళ ఓటరు కార్డులు నకిలీవైనా, నిజంగానే ఆయా ఓటర్లు లేకున్నా ఎవరు ఎక్కడనుంచి ఆయా ఓటరు కార్డులను డౌన్‌లోడ్ చేశారు, మార్పుచేర్పులు ఎవరు చేశారో అనే విషయాలపై దర్యాప్తు చేయనున్నారు.

మట్టి అద్దం పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్), జనవరి 21: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తిరుపతి జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి రచించిన మట్టి అద్దం (కవితా సంకలనం) పుస్తకావిష్కరణ సభను ఆదివారం ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్‌లో నిర్వహించారు. పుస్తకాన్ని ఎస్వీయూ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య ఆర్.రాజేశ్వరి ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు పుస్తక సమీక్ష చేశారు. శ్వేత పూర్వ సంచాలకులు భూమన్ మాట్లాడుతూ రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా మతం ప్రవేశించినా ప్రగతిశీలవాదులైన కవులు, రచయితలు మౌనంగా ఉన్నారని తెలిపారు. పాలకుల అక్రమాలపై గళమెత్తే వారి సంఖ్య తగ్గిపోతోందని, అటువంటి సమయంలో ఉద్యమ నేపథ్యం కలిగిన యువశ్రీ మురళి కవిత్వంలో మట్టి వాసన కనిపించిందని అన్నారు. మట్టి అద్దంలో రచయితకు ఉన్న గ్రామీణ నేపథ్యం, నాన్నపై ఉన్న మమకారం, తెలుగు భాష పట్ల ఆరాటం కనిపిస్తున్నాయని తెలిపారు. విద్వాన్ గండుపల్లి గోవిందయ్య స్వాగత వచనాలతో ప్రారంభమైన సభలో అ.ర.సం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా అ.ర.సం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్, గౌరవ అతిథులుగా తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షురాలు గంగవరపు శ్రీదేవి, తిరుపతి జిల్లా రచయితల సంఘం (తి.ర.సం) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజ, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. శతావధాని ఆముదాల మురళి, ఆకుల మల్లేశ్వరరావు, ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, తమటం రామచంద్రారెడ్డి, తోట వెంకటేశ్వర్లు, కలువగుంట రామమూర్తి, గజేంద్రరెడ్డి, పురుషోత్తమాచారి, నడ్డి నారాయణ, కన్నయ్య, సిద్దారెడ్డి, మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించిన పార్టీకే మద్దతు

- రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు



బ్రాహ్మణ సమాజ సమాఖ్య నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీకే తమ మద్దతు ఇస్తామని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు స్పష్టం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 2017లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో అన్ని రాజకీయ పక్షాలకు చెందిన వారు ఉన్నారని, అయినా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షలకు పైగా ఉన్న బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం 10 నుంచి 15 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యి కోట్లు ఇస్తామన్న వైసీపీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. అన్యాక్రాంతమైన బ్రాహ్మణ సమాజానికి సంబంధించిన స్థలాలను తిరిగి ఇవ్వాలని, బ్రాహ్మణ వృత్తి చేసుకుంటున్న వారికి రూ.25 వేలు ఇవ్వాలని, ఆలయ కైంకర్యాల విషయాల్లో అధికారులు, రాజకీయ జోక్యం ఉండకూడదని అన్నారు. టీటీడీలో పనిచేస్తున్న పోటు కార్మికులు, పరిచారికులు, వేదపండితులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్, కామేశ్వరప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సుబ్బారావు, మల్లికార్జున, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీలకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు



బీసీ సంఘ నాయకులతో కేశన శంకరరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 : తిరుపతి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో అన్ని పార్టీలు బీసీలకు తప్పకుండా రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల ద్వారా పదవులు పొందిన ఏ ఒక్కరూ వారి హక్కుల కోసం పోరాటం చేయడం లేదని మండిపడ్డారు. కనీసం బీసీల కోసం పనిచేస్తున్న సంఘాలకు తోడ్పాటు ఇవ్వడం లేదన్నారు. బీసీల సమస్యల మీద ఏ ఒక్క ప్రజాప్రతినిధి ప్రశ్నించడం లేదని ఆరోపించారు. తద్వారా బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చేపడుతున్న కుల గణనను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి గణాంకాలను నిగ్గు తేల్చాలన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన బీసీ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ వంటి అన్ని రంగాల్లో చట్ట ప్రకారం అవకాశాలు కల్పించాలన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, బీసీ కుల గణన, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు అవకాశాలు కల్పించడం, ఆధిపత్య కులాలను బీసీ జాబితాలో చేర్చుతుండటంపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతికుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, జిల్లా ఉపాధ్యక్షుడు మధు, బీసీ ఉద్యోగ సంఘ నేత తులసి, బీసీ విద్యార్థి నేత రాజ్‌కుమార్‌గౌడ్, కిరణ్‌గడ్, గురుసాయి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



చెర్లోపల్లిలో అ'పూర్వ' కలయిక

తిరుపతి రూరల్, జనవరి 21: చెర్లోపల్లి జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం పాఠశాలలో జరిగాయి. 1993-94 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి తమ హెచ్‌ఎం మునిక్రిష్ణారెడ్డిని, తెలుగు మాస్టారు మునస్వామి నాయుడు, సైన్స్ టీచర్ రాజగోపాల్ నాయుడితోపాటు ఇతర ఉపాధ్యాయులకు పాదపూజలు చేసి ఆశీర్వాదం అందుకున్నారు. మొత్తం 60 మంది విద్యార్థులు, అప్పటి ఉపాధ్యా యులు 9 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిసాగరంలో ముంచెత్తిన అఖండ పారాయణం

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం జరిగిన 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 18 నుంచి 21 సర్గల్లో ఉన్న 199 శ్లోకాలు, యోగ వాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 224 శ్లోకాలను పారాణయం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీనివాస్ బృందం రామా సీతారామ కీర్తనను ప్రారంభంలో, రాముని భజన సేయవే మనసా అనే కీర్తనను చివరలో రసరమ్యంగా ఆలపించారు.

నేటి నుంచి విశాఖకు ఇంద్ర ఏసీ సర్వీసు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21: తిరుపతి, విశాఖపట్నం మధ్య ఇంద్ర ఏసీ సర్వీసును సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ నుంచి రోజూ సాయంత్రం 4 గంటలకు 11వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి బయల్దేరుతుంది. మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు విశాఖపట్నానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి సాయంత్రం 5గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. సీటింగ్ సామర్థ్యం 40, టిక్కెట్ ధర పెద్దలకు రూ.1,760, పిల్లలకు రూ.1,400గా నిర్ణయించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని మంగళం డిపో మేనేజర్ భాస్కర్ తెలిపారు.

బ్రాహ్మణ వివాహ వేదికకు అనూహ్య స్పందన

తిరుపతి (కల్చరల్), జనవరి 21: బైరాగిపట్టెడలోని శ్రీవైఖానస (ఆశ్రమం) కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహణ సంక్షేమ సమాఖ్య అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికకు అనూహ్య స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కర్నూలు, కడప, నంద్యాల, అనంతపురం, గుంటూరు, పుంగనూరు, మదనపల్లి, నెల్లూరు జిల్లా ప్రతినిధులు సుమారు 700 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు రామశర్మ, గంగాధర్, చక్రపాణి ఆధ్వర్యంలో ఏడుగురికి షష్ఠిపూర్తి వేడుకలు నిర్వహించారు. దంపతులకు సింగిరాజు ప్రభాకర్ నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బ్రాహ్మణ సమాజం ఉపాధ్యక్షులు సనత్‌కుమార్, చక్రవర్తి రాఘవన్, కొత్తపల్లి విజయ్‌కుమార్, రవిరాజలోచన్, మల్లికార్జున ప్రసాద్, కృష్ణమూర్తి, పట్టాభిరామారావు, సంధ్యారాణి, నాగసుధావాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ఆహ్వానం లేకపోవడం బాధాకరం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21: అయోధ్యలో సోమవారం శ్రీరాముడి ఆలయ ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరురాలు ముర్ముకు ఆహ్వానం లేకపోవడం బాధాకరమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) సౌత్ ఇండియా అధ్యక్షుడు పి.అంజయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు, ప్రముఖులకు ట్రస్టు ద్వారా ఆహ్వానం పంపి, దేశాధినేతను ఎందుకు విస్మరించారో ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దళిత, ఆదివాసీలు ఎంతటి ఉన్నత పదవుల్లో ఉన్నా వివక్ష తప్పదని చెప్పడానికి ఈ ఘటన ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్రపతిని ఆహ్వానించాలని కోరారు.

గౌరిపెద్ది కృషి మరువలేనిది



తిరుపతి (కల్చరల్), జనవరి 21: అన్నమయ్య సంకీర్తనల పరిష్కరణలో గౌరిపెద్ది రామసుబ్బశర్మ కృషి మరువలేనిదని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ అన్నారు. సాహితీవేత్త, పరిష్కర్త, టీటీడీకి ఎనలేని సేవలు అందించిన దివంగత రామసుబ్బశర్మ 33వ వర్థంతిని టీటీడీ ఆదివారం నిర్వహించింది. అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సభలో కుమార్ మాట్లాడుతూ గౌరిపెద్దివారి సాహితీ వైభవం, సప్తచండీ-నవచండీ గురించి తెలిపారు. అన్నమాచార్యుల సంకీర్తనల 27 సంపుటాలు పరిష్కరించడంలో గౌరిపెద్ది వారి కృషిని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎస్వీ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామారావు గౌరిపెద్ది వారి పాండిత్యం-అవధాన పద్య సౌరభం అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గౌరిపెద్ది వెంకటభగవాన్, టీటీడీ అధికారులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

తిరుపతి

వైసీపీ ప్రభుత్వం పోతేనే రాష్ట్రాభివృద్ధి

- దొంగ ఓట్లపై టీడీపీ, జనసేన పోరాటం ఆగదు
- తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21 : వైసీపీ ప్రభుత్వం పోతేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ స్పష్టం చేశారు. దొంగ ఓట్లపై టీడీపీ, జనసేన పోరాటం ఆగదన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, తద్వారా ప్రతి పౌరుడూ ఇబ్బంది పడాల్సి వస్తోందని విమర్శించారు. ఆదాయం లేని రాష్ట్రంలో ఉన్న కంపెనీలను కాపాడుకోలేని పరిస్థితికి వైసీపీ దిగజారిపోయిందన్నారు. చెత్తపై పన్ను వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని దుయ్యబట్టారు. ఇప్పటికే 9సార్లు కరెంటు చార్జీలు పెంచేశారన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి సొంత మనుషులకు కాంట్రాక్టులు ఇచ్చి వేల కోట్లు సంపాదించుకున్నారన్నారు. నాసిరకం మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. బడుగు బలహీన వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. జగనన్న కాలనీల పేరుతో ముందుగా వైసీపీ నాయకులు అగ్రిమెంట్లు చేసుకుని భూమి విలువకన్నా పదిరెట్లు అధికంగా ప్రభుత్వం నుంచి కాజేశారని ఆరోపించారు. టీడీపీ విడుదల చేసిన భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఉపాధి, ఉద్యోగాలు, యువకులు, నిరుద్యోగులు, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమని గుర్తు చేశారు. తిరుపతిలో రోడ్లు వేసి అభివృద్ధి అంటే ప్రజలు నవ్వుకుంటున్నారని, వీటి వెనుక భాగోతం ప్రజలకు తెలుసునని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నాయకులు వూకా విజయకుమార్, బుల్లెట రమణ, జగన్నాథం, మనోహర్ ఆచారి, సుబ్బుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో ప్రతిభకు మెడల్స్ ప్రదానం



సర్టిఫికెట్లు అందిస్తున్న రామకృష్ణారెడ్డి, విమల

తిరుపతి(విద్య) జనవరి 21 : ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని ఆర్కే అబాకస్ శిక్షణా కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు ఆదివారం చైర్మన్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డితో డైరెక్టర్ ఆర్కే విమల కలసి సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 13 ఏళ్లుగా విద్యార్థులకు వివిధ లెవల్స్‌లో శిక్షణ ఇస్తున్నామని, ఆన్‌లైన్‌లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ పూర్తిచేశారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆద్విక్ 3వ లెవల్‌లో ప్రతిభచాటి ప్రథమ బహుమతి సాధించగా, వివిధ విభాగాల్లో పలువురు విద్యార్థులు బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు. దేశ రక్షణ రంగం, మీడియా, పోలీసు విభాగంలో పనిచేసే వారి పిల్లలకు ఫీజులోరాయితీ ఇస్తున్నామని వివరించారు. వివరాలకు 99895 00074, 73865 02450లను సంప్రదించాలన్నారు. ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.06 కోట్లు

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.06 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 76,041 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,336 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు





సునీత - ఐఏఎస్ బ్యాచ్

తిరుమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో గాయని సునీత, 2023 ఐఏఎస్ బ్యాచ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

గ్రామ బహిష్కరణపై అధికారులు జోక్యం చేసుకోవాలి



బాలరాజు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: గ్రామంలో తలపెట్టిన పూజలకు మహిళా సంఘాల నిధులు ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించినందుకు తన కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారని, దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని బాధితుడు, సినీ జానపద గేయ రచయిత బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఏర్పేడు మండలం పరమాలపల్లిలో నివసిస్తున్న తన కుటుంబాన్ని గ్రామానికి చెందిన తొమ్మిది మంది కుట్రపన్ని గ్రామ బహిష్కరణ చేయించారన్నారు. గ్రామంలో దెయ్యాలు తిరుగుతున్నాయన్న నెపంతో నాలుగు వైపులా శక్తిరాళ్లు నాటుకోవడానికి మహిళా సంఘాల నిధులు వాడుకోవడాన్ని వ్యతిరేకించడంతో తోడబుట్టిన వారిని సైతం తన ఇంటికి రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులు పాలు తెచ్చుకోవడాన్ని కూడా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అయోధ్యరామ శ్రీరామ గీతం ఆవిష్కరణ



పాటను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, పక్కనే రచయిత మహేష్

తిరుపతి(విద్య) జనవరి 21 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల రచించిన అయోధ్యరామ శ్రీరామ జయహో విజయహో గీతాన్ని(పాటను) ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. భవానీనగర్‌లోని న్యాయవాద పరిషత్ కార్యాలయంలో పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యుడు వజ్రాల చంద్రశేఖర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ పాటను కావలికి చెందిన టీచర్ ఎస్.రమణ స్వరపరిచారు. రామచరిత్ర, భక్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా వర్ణిస్తూ రచన చేసిన మహేష్‌ని, అద్భుతగానం అందించిన గాయకుడిని పలువురు అభినందించారు. పరిషత్ సభ్యులు గాలి మధు, సురేష్, నారాయణ, సంఘ నాయకులు గురుప్రసాద్, అశోక్, మెహర్‌బాబా, గుప్తా పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ అప్రైజర్ ఏపీ నూతన కార్యవర్గం



నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21 : భారత్ యూనియన్ బ్యాంక్ అప్రైజర్ ఏపీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం ఓ హోటల్లో ఏపీ యూనియన్ బ్యాంకు జువెల్ అప్రైజర్ల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కమిటీ ఉండాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ చైర్మన్‌గా కఠారి విజయ్‌కృష్ణ(తిరుపతి), అధ్యక్షుడిగా కె.బాలాజీ(కావలి), ట్రజరర్‌గా నాగపద్మ (గుంటూరు)ను ప్రాథమికంగా ఎన్నుకున్నారు. రెండో విడతలో కార్యదర్శి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈ సమావేశానికి యూనియన్ బ్యాంకు 16జోన్ల నుంచి వందమందిపైగా అప్రైజర్లు హాజరయ్యారు.

24న జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21: ఎస్వీయూలో ఈనెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎంప్లాయిమెంట్ ఆఫీసులో మేళా ప్రారంభం కానుంది. మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, ల్యాబ్ అనలిస్ట్, మోటర్ ఫిట్టర్ వంటి ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు అర్హులు. సమగ్ర సమాచారం కోసం 7989810194లో సంప్రదించాలని నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు.

దొంగ ఓట్ల వెనుక వైసీపీ ప్రజాప్రతినిధులు

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

గాంధీ విగ్రహం ఎదుట తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నిరసన



గాంధీ విగ్రహం వద్ద తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతల నిరసన

తిరుపతి, జనవరి21(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని దొంగ ఓట్లు రాజ్యంగా మార్చేశారని, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. బోగస్ ఓట్ల కుంభకోణానికి నిరసనగా ఆదివారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు చేరి దొంగ ఓట్లకు అడ్డాగా మార్చేశారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, విజయానందరెడ్డి నేతృత్వంలో దొంగఓట్ల నమోదు జరిగిందని, అసలు సూత్రధారి జగన్ అని, తెర వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అధికారులు ఇప్పటికే మూల్యం చెల్లించుకున్నారని, ఆజాబితాలో మరికొంతమంది ఉన్నారనిచెప్పారు. పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆయన డిమాండు చేశారు. టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, తెలుగుయువత నాయకులు పెరుమాళ్ మధు, ఆర్సీ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్, టౌన్‌బ్యాంకు ఎన్నికల్లోనూ వైసీపీ దొంగ ఓట్ల జాతర అందరూ చూశారన్నారు. తిరుపతికి ప్రత్యేకాధికారిని నియమించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

సీఎంకు మాగోడు వినపడదా? / 41వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె



ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

తిరుపతి (రవాణా), జనవరి 21 : 41 రోజులుగా రోడ్లపైకి వచ్చి సమ్మె చేస్తున్నా తమగోడు సీఎం జగన్‌కు పట్టడం లేదా అని అంగన్వాడీలు ప్రశ్నించారు. ఆదివారం వారు తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న సమ్మె శిబిరం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ అంగన్వాడీ మహిళలు పోరాటం చేస్తుంటే సీఎం జగన్ ప్యాలెస్‌లో కూర్చుని నవ్వుకుంటుండడం సరికాదన్నారు. తీరు మార్చుకోకపోతే ఆయన్ను చూసి మహిళలు నవ్వుకునే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఆయన శాశ్వతంగా ఇంట్లోనే కూర్చునే పరిస్థితి వస్తుందన్నారు. ఎన్నికలకు ముందు 'నేనున్నాను.. నేను విన్నాను.. సమస్యలను పరిష్కరిస్తాను..' అని అక్కచెల్లెమ్మల నెత్తిమీద చెయ్యిపెట్టి చెప్పిన సీఎం నేడు మాట తప్పడం సరికాదన్నారు. విజయవాడలో వారం రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న అంగన్వాడీల ఆరోగ్యం క్షీణిస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే విజయవాడకు వెళ్లి నిరసన తెలియజేస్తామని అన్నారు. అప్పటికీ దిగిరాకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు నాగరాజమ్మ, జయప్రభ, సుజిత, రోజా, యువరాణి, కల్పన, గీత, గోమతి, ఎల్లమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

గాంధీ రోడ్డుకు నూతన గడియారం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21 : నగరానికి తలమానికం గాంధీరోడ్డు. దానికి ఏకైక చిహ్నం క్లాక్ టవర్(గడియారం). ఆ జ్ఞాపకాలు రెండు దశాబ్దాలుగా చెరిగిపోయాయి. కొందరు సీనియర్ సిటిజన్ల కోరిక మేరకు నూతన గడియారం ఏర్పాటు చేశారు. 125 ఏళ్ల క్రితం గాంధీరోడ్డు, పూల మార్కెట్ మలుపు వద్ద, కోదండరాముల ఆలయం, గర్ల్స్ హాస్టల్స్ ముందు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రెండు టవర్‌క్లాక్‌లు ఏర్పాటు చేసింది. అలారం, లైటింగ్ ఏర్పాట్లు చేశారు. ఆంగ్లేయులు వెళ్లిపోయినా గడియారాలు వారికి గుర్తుగా ఉండిపోయాయి. కాలక్రమేణా మరమ్మతులకు గురై పనిచేయకపోవడంతో మరుగునపడిపోయాయి. అటువైపుగా సంచరించే వృద్ధులు, తిరుమల కాలినడక భక్తులు వీటిని గమనించి ఆనాటి జ్ఞాపకాలు మరుగునపడిపోతున్నాయని ఆవేదన చెందుతుండడం నగరపాలక సంస్థ దృష్టికి వచ్చింది. ప్రధాన నగరాల తరహాలో తాజ్ కంపెనీకి చెందిన దాదాపు రూ.4.5లక్షల విలువచేసే గడియారం తెప్పించారు. పాతదాన్ని తొలగించి నూతన గడియారాన్ని అమర్చారు. గంట గంటకూ నగరం మొత్తం వినిపించేలా అల్లార మోగడంతో పాటు, రాత్రి వేళలో రంగురంగుల విద్యుత్ కాంతులతో ఆకర్షణీయం నిలుస్తోంది. ఇదే తరహాలో త్వరలోనే మరొక టవర్‌క్లాక్‌ను గర్ల్స్ హాస్టల్ ముందు అమర్చనున్నారు.



బ్రిటీష్‌కాలం నాటి గడియారం



గాంధీ రోడ్డులో నూతన గడియారం

నవీన్ మార్షల్ ఆర్ట్స్ టీమ్ నోబెల్ వరల్డ్ రికార్డు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21 : శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నవీన్ మార్షల్ ఆర్ట్స్ టీమ్ కరాటే పంచ్‌లో నోబుల్ వరల్డ్ రికార్డు సృష్టించింది. నగర పరిధిలోని 500మంది కరాటే క్రీడాకారులు ఒక్క నిమిషంలో 50వేల పంచులు చేసి, వరల్డ్ రికార్డు సృష్టించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని నోబెల్ వరల్డ్ రికార్డు చీఫ్ అడ్వైజర్ గోవింద్, మెయిన్ కోచ్ నవీన్‌మాస్టర్(నవీన్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు), చీఫ్ ఎగ్జామినర్ పి.అనిల్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా గ్లోబల్ ఐకాన్ స్కూల్ డైరెక్టర్ శశిరేఖ, మాపిల్ ఇంగ్లిష్ మీడియం ప్రైమరీ స్కూల్ కరెస్పాండెంట్ సి.కవితసునీల్, శ్రీవిద్య వండర్‌కిడ్స్ డైరెక్టర్ ఎన్.రవికుమార్, శ్రీరామ స్మార్ట్ కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్‌నాయర్ పాల్గొన్నారు.



మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు చేస్తున్న కరాటే క్రీడాకారులు

స్కార్పియోను మూల పడేశారు!



తిరుపతి(కొర్లగుంట), జనవరి 21: స్థానిక ఆర్టీవో కార్యాలయం ముందు రెండేళ్లుగా ఓ స్కార్పియో వాహనం నిరుపయోగంగా పడి ఉంది. దానికి వెనుక అద్దానికి ప్రభుత్వం వాహనం అని రాసుంది. నంబర్ ప్లేట్స్ కూడా ఉన్నాయి. టైర్లు మినహా వాహనం మెరుగ్గానే ఉంది. ఇది ఎవరి వాహనం..ఇలా ఎందుకు వదిలేశారు.. అని అక్కడికి వచ్చిన వారు చర్చించుకోవడం కనిపించింది.

జనసేనలోకి టీఎన్‌పాళెం యువత

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21 : ఒకటో డివిజన్ తిమ్మినాయుడుపాళెంకు చెందిన పలువురు యువకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వందమంది యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, రాజేష్‌యాదవ్, నరేష్, ప్రసాద్, బాలాజీ, మదన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



పాదయాత్ర చేస్తున్న రజక సంఘం నేతలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21 : కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజక జాతిని ఎస్సీ జాబితాలో చేర్చాలని, ఆ దిశగా రాజకీయ పార్టీలు నిర్ణయం ప్రకటించాలని నేషనల్ దోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తిరుపతి నుంచి విజయవాడకు ఆయన తలపెట్టిన పాదయాత్ర ఆదివారం అలిపిరి శ్రీవారి పాదాల వద్ద నుంచి ప్రారంభమైంది. పాదాల మండపం వద్ద పూజలు చేయించి, పాదయాత్రసఫలీకృతమవ్వాలని ప్రార్థించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలలో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, 11 రాష్ట్రాల్లో ఓబీసీలుగా కొనసాగుతున్నారని తెలిపారు. ఆ రాష్ట్రాల్లోనూ ఎస్సీ జాబితాలో చేర్చి వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ మీసాల రంగన్న, కేశన శంకరరావు, కర్ణాటక చిత్రదుర్గ పీఠాధిపతి బసవమాసుదేవస్వామి, బీసీ సంక్షేమ సంఘం నేతలు కుమ్మర క్రాంతికుమార్, నాగరాజుగౌడ్, ఉమాపతి, సుధాకర్, దేవానంద్, దాము, యశోద తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అణచివేతకు గురవుతున్నారు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: దేశంలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా అణచివేతకు గురవుతున్నారని, అల్పసంఖ్యాక వర్గం వారు దాన్ని అనుభవిస్తున్నారని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి బీసీ యువకులు మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్రను శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభించారని, ఫిబ్రవరి 4న తిరుపతి చేరుకుంటుందని తెలిపారు. దేశంలో 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఈ యాత్ర ద్వారా కోరుతున్నట్లు చెప్పారు. బీసీలకు బాసటగా బీసీ అట్రాసిటీ యాక్టును, ప్రైవేటు రంగంలో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించే పార్టీకి మద్దతు ఇస్తామన్నారు. తిరుపతిలో జరిగే ముగింపు సభకు ఎనిమిది రాష్ట్రాల బీసీ ముఖ్యమంత్రులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకానమ్మ, తురక అమర్‌నాథ్, జగన్నాథం, ప్రసన్నకుమార్, లక్ష్మణరావు, నారాయణస్వామి, దేవి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెంగళరావు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

దళితులపై దాడులను మరువలేం: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 21: వైసీపీ ప్రభుత్వ పాలనలో దళితులపై జరిగిన దాడులను మరువలేమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి దళితులకు ఎంతో చేశామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి రాగానే వైసీపీ పాలనలో దళితులపై హత్యలు, దాడులు పెరిగాయన్నారు. దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారని తెలిపారు. దళితుడైన కోడికత్తి శీను కేసు విచారణ జాప్యం చేయించడంతో పాటు అతడికి బెయిల్ రాకుండా ఇబ్బందులు పెట్టడం అన్యాయమన్నారు. దళితులకు అన్ని విధాల న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీయేనన్నారు. చంద్రబాబునాయుడు దళితుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు పరిచారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో దళితులను మరోసారి మోసం చేసేందుకే అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. దళిత ద్రోహి అయిన సీఎం జగన్‌కు తగిన గుణపాఠం చెప్పి రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పెంచలయ్య, ఇశ్రాయిల్‌కుమార్, రవీంద్రరెడ్డి, సురేంద్ర, శ్రీనివాసులు, కృష్ణయ్య, నాగేంద్ర, రవికుమార్, గురవయ్య, వెంకటయ్య, సురేష్, అల్లీహుస్సేన్, నాజరుద్దీన్, సునీల్, సందీప్, నాగార్జున, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించిన పార్టీకి మద్దతు

రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సమాజ సమాఖ్య నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీకే తమ మద్దతు ఇస్తామని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు స్పష్టం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 2017లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో అన్ని రాజకీయ పక్షాలకు చెందిన వారు ఉన్నారని, అయినా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షలకు పైగా ఉన్న బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం 10 నుంచి 15 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యి కోట్లు ఇస్తామన్న వైసీపీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. అన్యాక్రాంతమైన బ్రాహ్మణ సమాజానికి సంబంధించిన స్థలాలను తిరిగి ఇవ్వాలని, బ్రాహ్మణ వృత్తి చేసుకుంటున్న వారికి రూ.25 వేలు ఇవ్వాలని, ఆలయ కైంకర్యాల విషయాల్లో అధికారులు, రాజకీయ జోక్యం ఉండకూడదని అన్నారు. టీటీడీలో పనిచేస్తున్న పోటు కార్మికులు, పరిచారికులు, వేదపండితులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్, కామేశ్వరప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సుబ్బారావు, మల్లికార్జున, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీలకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేశన శంకరరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21: తిరుపతి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో అన్ని పార్టీలు బీసీలకు తప్పకుండా రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల ద్వారా పదవులు పొందిన ఏ ఒక్కరూ వారి హక్కుల కోసం పోరాటం చేయడం లేదని మండిపడ్డారు. కనీసం బీసీల కోసం పనిచేస్తున్న సంఘాలకు తోడ్పాటు ఇవ్వడం లేదన్నారు. బీసీల సమస్యల మీద ఏ ఒక్క ప్రజాప్రతినిధి ప్రశ్నించడం లేదని ఆరోపించారు. తద్వారా బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చేపడుతున్న కుల గణనను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి గణాంకాలను నిగ్గు తేల్చాలన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన బీసీ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీలకు జనాభా దమాషా ప్రకారం విద్యా, ఉద్యోగ వంటి అన్ని రంగాల్లో చట్ట ప్రకారం అవకాశాలు కల్పించాలన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, బీసీ కుల గణన, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు అవకాశాలు కల్పించడం, ఆధిపత్య కులాలను బీసీ జాబితాలో చేర్చుతుండటంపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, జిల్లా ఉపాధ్యక్షుడు మధు, బీసీ ఉద్యోగ సంఘ నేత తులసి, బీసీ విద్యార్థి నేత రాజ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో 24న జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21: ఎస్వీయూలో ఈనెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎంప్లాయిమెంట్ ఆఫీసులో మేళా ప్రారంభం కానుంది. మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, ల్యాబ్ అనలిస్ట్, మోటర్ ఫిట్టర్ వంటి ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు అర్హులు. సమగ్ర సమాచారం కోసం 7989810194లో సంప్రదించాలని నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వం పోతేనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21 : వైసీపీ ప్రభుత్వం పోతేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ స్పష్టం చేశారు. దొంగ ఓట్లపై టీడీపీ, జనసేన పోరాటం ఆగదన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, తద్వారా ప్రతి పౌరుడూ ఇబ్బంది పడాల్సి వస్తోందని విమర్శించారు. ఆదాయం లేని రాష్ట్రంలో ఉన్న కంపెనీలను కాపాడుకోలేని పరిస్థితికి వైసీపీ దిగజారిపోయిందన్నారు. చెత్తపై పన్ను వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని దుయ్యబట్టారు. ఇప్పటికే 9సార్లు కరెంటు చార్జీలు పెంచేశారన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి సొంత మనుషులకు కాంట్రాక్టులు ఇచ్చి వేల కోట్లు సంపాదించుకున్నారన్నారు. నాసిరకం మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. బడుగు బలహీన వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. జగనన్న కాలనీల పేరుతో ముందుగా వైసీపీ నాయకులు అగ్రిమెంట్లు చేసుకుని భూమి విలువకన్నా పదిరెట్లు అధికంగా ప్రభుత్వం నుంచి కాజేశారని ఆరోపించారు. టీడీపీ విడుదల చేసిన భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఉపాధి, ఉద్యోగాలు, యువకులు, నిరుద్యోగులు, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమని గుర్తు చేశారు. తిరుపతిలో రోడ్లు వేసి అభివృద్ధి అంటే ప్రజలు నవ్వుకుంటున్నారని, వీటి వెనుక భాగోతం ప్రజలకు తెలుసునని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు వూకా విజయకుమార్, బుల్లెట రమణ, జగన్నాథం, మనోహర్ ఆచారి, సుబ్బుయాదవ్ పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

తడ, జనవరి 21: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన తడ మండలంలోని చేనిగుంట వద్ద జరిగింది. నెల్లూరు జిల్లా కావలి మండలం, మద్దూరుపాడుకు చెందిన కాళహస్తి సాయివంశీకృష్ణ(27) సూళ్లూరుపేటలో నివాసం ఉంటూ తడలోని ఓ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం విధులకు హాజరయ్యేందుకు బైక్‌లో వెళ్తుండగా చేనిగుంట మలుపు వద్ద ఓ ట్రాక్టర్ రాంగ్‌రూట్‌లోకి వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సాయివంశీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయికృష్ణ యాచేంద్రకు పరామర్శ

వెంకటగిరిటౌన్, జనవరి 21: ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్రను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకుని వచ్చే ఎన్నికల్లో వెంకటగిరిలో వైసీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

వైసీపీ అరాచకాలతో పరిశ్రమలు పరార్

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి నాయుడు

డక్కిలి, జనవరి 21: జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రానికి ఒక్క పరిశ్రమా రాకపోగా ఉన్నవి కూడా వైసీపీ నేతల అరాచకాలు చూసి తట్టుకోలేక ఇతర రాష్ట్రాలకు తరలి పోయాయని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఐటీ మంత్రులు దావోస్ వెళ్లి పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి పెట్టుబడులు తీసుకెళ్తుంటే మన పాలకులు తమ సీటు వుంటుందా.. ఊడుతుందా అని ఆలోచించే పనిలో వున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ముఖ్యమంత్రి అవ్వడమే మన రాష్ట్రానికి పట్టిన ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రానికి రూ.43 వేల కోట్లు పెట్టుబడులు వస్తుంటే మన ముఖ్యమంత్రి తనకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో కాళీగా వున్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన జగన్ నాలుగున్నరేళ్లుగా ఆ ఊసెత్తడం లేదన్నారు. వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఏ మోహం పెట్టుకొని ఇంటింటికీ తిరుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, యువత గంజాయి మత్తులో పడి తమ జీవితాలను సర్వనాశనం చేసుకుటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజలు కళ్లు తెరిచి జగన్‌ను ఇంటికి సాగనంపకనపోతే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని చెప్పారు. అంతకుముందు కుప్పాయపాళెం గ్రామంలో జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల ముగుంపు కార్యక్రమానికి రవి నాయుడు హాజరయ్యారు. విన్నర్‌గా నిలిచిన లింగసముద్రం జట్టుకు రూ.15వేలు, రన్నర్స్‌గా నిలిచిన కుప్పాయపాళెం జట్టుకు రూ.8 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు కృష్ణా యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, నాయకులు చెలికం భాస్కర్ నాయుడు, కిషోర్ నాయుడు, మూర్తి, హేమంత్ చౌదరి, సుకుమార్ వెంకటయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.





మూతపడ్డ దుకాణాలు - నిర్మానుష్యంగా ఉన్న పాత శ్రీకాళహస్తి జీఎన్‌టీ రోడ్డు

నాయుడుపేటలో సామాజిక సాధికార యాత్ర

దుకాణాల మూత... దారి మళ్లింపుతో జనానికి ఇక్కట్లు



యాత్రలో విజయసాయిరెడ్డి, గురుమూర్తి, సంజీవయ్య తదితరులు

నాయుడుపేట, జనవరి 21: వైసీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రను నాయుడుపేటలో ఆదివారం నిర్వహించారు. స్థానిక పిచ్చిరెడ్డి తోపులోని విజయగణపతి దేవస్థానం నుంచి పట్టణ పురవీధుల్లో వైసీపీ నాయకులు ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వరకు నడిచారు.యాత్రను పురస్కరించుకుని పట్టణంలోని పలు దుకాణాలను మూసివేశారు. ప్రధాన దారుల్లో బారికేడ్లు పెట్టి రాకపోకలు మళ్లించడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. బందోబస్తుకు ఇతర ప్రాంతాల నుంచి పోలీసులు రావడంతో బారికేడ్ల సమీపంలోనే తమ నివాసాలు ఉన్నాయని ఆ దారిలో వెళ్లే జనం చెప్పినా వినకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. మేనకూరు వెళ్లే రహదారిలో, పట్టణ ప్రధాన రహదారి అయిన పాత శ్రీకాళహస్తి రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బారికేడ్లు పెట్టేయడంతో అంతటి రద్దీ రహదారి నిర్మానుష్యంగా కన్పించింది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన యాత్రలో వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దనరెడ్డి,కామిరెడ్డి రాజారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, పోట్లపూడి రాజేష్, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం డుమ్మా

సామాజిక సాధికారిక యాత్రకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య భారీగా జనసమీకరణ చేశారు. అయితే ఆయన్ను వ్యతిరేకిస్తున్న వైసీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొనలేదు. సూళ్లూరుపేట టికెట్ సంజీవయ్యకు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని విజయసాయిరెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి క్రమశిక్షణగా ఉండాలని అసమ్మతి నేతలు రామమోహన్‌రెడ్డి, జనార్దన రెడ్డి, రఫీ, శేఖర్‌రెడ్డిలకు సూచించారు.పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై కట్టా సుధాకర రెడ్డి, శ్రీమంత్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డిలకు పార్టీ షోకాజ్ నోటీసులు ఇచ్చిందని వారి సమాధానం సంతృప్తికరంగా లేదన్నారు. పార్టీలో ఎంతటి వారైనా అధిష్ఠానం ఆదేశాలను శిరసావహించాల్సిందేనని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

దొంగ ఓట్ల నమోదు వెనుక వైసీపీ ప్రజాప్రతినిధులు

తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నిరసన



గాంధీ విగ్రహం వద్ద తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతల నిరసన

తిరుపతి, జనవరి21(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని దొంగ ఓట్లు రాజ్యంగా మార్చేశారని, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయని తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు విమర్శించారు. బోగస్ ఓట్ల కుంభకోణానికి నిరసనగా ఆదివారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు చేరి దొంగ ఓట్లకు అడ్డాగా మార్చేశారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, విజయానందరెడ్డి నేతృత్వంలో దొంగ ఓట్ల నమోదు జరిగిందని, అసలు సూత్రధారి జగన్ అని, తెర వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అధికారులు ఇప్పటికే మూల్యం చెల్లించుకున్నారని, ఆ జాబితాలో మరికొంతమంది ఉన్నారని చెప్పారు. పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆయన డిమాండు చేశారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత నాయకులు పెరుమాళ్ మధు, ఆర్సీ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్, టౌన్‌బ్యాంకు ఎన్నికల్లోనూ వైసీపీ దొంగ ఓట్ల జాతర అందరూ చూశారన్నారు. తిరుపతికి ప్రత్యేకాధికారిని నియమించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

పేదల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, జనవరి 21: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 171 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తాళ్వాయిపాడు, పెన్నేపల్లి గ్రామాల్లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న పథకాల ప్రయోజనాలను వివరిసూ.. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి ప్రయోజనం చేకూర్చడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులతో పాటు ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను మహిళలకు అందజేశారు. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారి విధానాన్ని అధికారులు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, చెంబేడు పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమోహన్‌రెడ్డి, ఏవో గొడవర్తి ప్రవీణ, ఈవోపీఆర్డీ విజయమ్మ, సర్పంచు కుదిరి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరి, బీజేపీ అధ్యక్షుడు గోగుతోటి మురళి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రవి, జనార్దన్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సూళ్లూరుపేట, జనవరి 21: సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అలవలవారి కంటి వైద్యశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కాపిరెడ్డి రాజారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అనిల్ రెడ్డి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ సాయిరాం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి తిరుపతిలోని అరవింద వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు అట్రంబాకం దశరథ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, అలవల సుధాకర్ రావు, వేనాటి ధనుంజయ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, నాదెండ్ల శాంతకుమారి, సుంకర ప్రతిమ, వేనాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖకు ఇంద్ర ఏసీ సర్వీసు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21: తిరుపతి, విశాఖపట్నం మధ్య ఇంద్ర ఏసీ సర్వీసును సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టేషన్ నుంచి రోజూ సాయంత్రం 4గంటలకు 11వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి బయల్దేరుతుంది. మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు విశాఖపట్నానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి సాయంత్రం 5గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. టిక్కెట్ ధర పెద్దలకు రూ.1,760, పిల్లలకు రూ.1,400గా నిర్ణయించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని మంగళం డిపో మేనేజర్ భాస్కర్ తెలిపారు.

భక్తిసాగరంలో ముంచెత్తిన అఖండ పారాయణం

తిరుమల, జనవరి21 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం జరిగిన 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 18 నుంచి 21 సర్గల్లో ఉన్న 199 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 224 శ్లోకాలను పారాణయం చేశారు.

పుత్తూరు వార్తలు

వన్నెకుల రెడ్డి సంఘ భవనానికి పూజ



భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, జనవరి 21: వన్నెకుల రెడ్డి సంఘ భవనానికి మంత్రి రోజా ఆదివారం భూమిపూజ చేశారు. ఆ సంఘ అధ్యక్షుడు వెంకటేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, కార్యదర్శి మురళిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి పాల్గొన్నారు.

జగన్ సర్కార్ కన్నా బ్రిటీషర్లే నయం

పుత్తూరు అర్బన్, జనవరి 21: సీఎం జగన్ సర్కార్ కన్నా బ్రిటీషర్లే నయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం యూనియన్ పిలుపు మేరకు చలో విజయవాడకు పుత్తూరు నుంచి అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించిన సీఎం జగన్ ఆ మహనీయుడు రచించిన రాజ్యాంగంలోని నిరసన తెలిపే హక్కును సైతం కాలరాస్తుండడం దారుణమన్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని 41 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి వారి చిరు ఉపాధిని దెబ్బకొట్టాలని చూడడం నీచమన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం అనుసరించాల్సిన ఏ పద్ధతినీ జగన్ సర్కార్ పాటించడంలేదని మండిపడ్డారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా, పోలీసులతో అంగన్వాడీలను అణచివేసే ప్రయత్నం చేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తమకు మద్దతుగా సేకరించిన కోటి సంతకాలను సీఎం జగన్‌కు ఆయన ఇంటి వద్ద చేర్చి తీరుతామని, చలో విజయవాడ విజయవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

వైసీపీ పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 21: వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య అన్నారు. చేశారు. ఆదివారం పట్టణంలోని మంచినీళ్లబావి వీధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంగతి దేవుడుకు ఎరుక సంక్షేమం మాటున పది రూపాయలిచ్చి పన్నుల పేరుతో వందల రూపాయలను లాగేసుకున్న దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీనే అని దుమ్మెత్తిపోశారు. ఐదేళ్లలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదలు, మధ్య తరగతి వర్గాల నడ్డివిరిచారని, ఎన్నికల ప్రచారంలో నేను ఉన్నాను... నేను విన్నాను అని ధీర్ఘాలు తీసిన జగన్ ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. చార్జీల పెంపుతో సరిపెట్టకుండా 50 యూనిట్లు వరకు ఉన్న స్లాబ్‌ను 30 యూనిట్లకు కుదించి ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.500 అదనంగా వసూలు చేసి సొంత ఖజానా నింపుకున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేయనంత పన్నులు డీజిల్, పెట్రోల్‌పై మోపడంతో నిత్యావసర సరుకులు తడిసిమోపడవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ చార్జీలు సైతం భారీగా వడ్డించిన దిక్కుమాలిన ప్రభుత్వమని విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా ఏటా ఆస్తి విలువ పెంచి, దానిపై మరో 15శాతం ఇంటి పన్నులు పెంచి ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. చెత్త మీద పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రి పరిపాలనలో ఇంతకు మించి ఏమీ ఆశించలేమని స్పష్టం చేశారు. ప్రతి సమావేశంలో నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ బీరాలు పలికే సీఎం జగన్ ఆ వర్గాలకు గతం నుంచి వస్తున్న ఆర్థిక ప్రయోజనాలు, పథకాలు రద్దు చేసి తీరని ద్రోహం చేశారని నిప్పులు చెరిగారు. కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన జగన్ రాజకీయ నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చారే తప్ప ఒక్క రూపాయి బడ్జెట్ కేటాయించకుండా యువతను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైన్, మైన్, లాండ్, శాండ్ దోపిడీతో పాలన సాగిస్తున్న జగన్‌కుచరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉండారని తేల్చి చెప్పారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, మండల అధ్యక్షుడు రవికుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎన్ ధనపాల్, రూరల్ ప్రధాన కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి



బీసీ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ హెలెన్

నారాయణవనం, జనవరి 21: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బీసీ కాలనీలో జయహో బీసీ సదస్సు మండల అధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాలు, అవకాశాలు వచ్చాయని గుర్తుచేశారు. వైసీపీ బీసీలను వెన్నెముఖగా ప్రచారం చేసుకుని నేడు తీరని ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. బీసీల సంక్షేమ పథకాలకు నిధులకు కోత విధించిందని విమర్శించారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో బీసీల సంక్షేమం కోసం ఒక్క పథకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని మండిపడ్డారు. ఉచితంగా దొరికే ఇసుకను ఆదాయ వనరుగా మార్చి రూ.కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పవర్ లూమ్స్ కార్మికులకు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. బీసీలు ఆర్థికంగా ఎదగాలంటే టీడీపీని ఆశీర్వదించి, చంద్రబాబునాయుడుకు మద్దతుగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సదాశివం, నియోజకవర్గ అధ్యక్షుడు పరందామయ్య, ప్రధాన కార్యదర్శి దయానిధి, తెలుగు మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, నాయకులు బాబు, రవి, కందస్వామి, లక్ష్మన్, వాసుదేవన్, క్లస్టర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రాహు కేతు పూజల్లో దర్జాగా వసూళ్లు
ఉచిత సేవకుడిపై భక్తుల ఫిర్యాదు

శ్రీకాళహస్తి, జనవరి 21:శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రూ.750 రాహు కేతు పూజ మండపంలో అక్రమంగా నగదు వసూలు చేయడంతో ఓ ఉచిత సేవకుడిపై భక్తులు ఫిర్యాదు చేశారు.ఉత్తర భారతదేశానికి చెందిన ఇద్దరు భక్తులు రాహు కేతు పూజలు చేసుకునేందుకు మండపంలో వున్న ఒక ఉచిత సేవకుడిని సమాచారం అడిగారు. కౌంటర్ నుంచి పూజా టిక్కెట్లు తీసుకోవాలని... తనకు నగదు ఇస్తే తీసుకువస్తానని చెప్పడంతో ఫోన్‌పే ద్వారా డబ్బు జమ చేశారు. టికెట్లపై ముద్రించిన ధర కన్నా రూ.200 అదనంగా వసూలు చేయడంతో భక్తులు నిలదీశారు. అడ్డదారిలో టికెట్ తీసుకొచ్చినందుకు తీసుకున్నానని చెప్పడంతో డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్యకు సమాచారం ఇచ్చారు. అనంతరం నగదు జమ చేసిన ఆధారాలను పొందుపరుస్తూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈవో రామారావు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని ఆలయ అధికారులు తెలిపారు.

రేణిగుంట గౌరీనగర్‌లో గంగనీరు వృథా



రేణిగుంట, జనవరి21: రేణిగుంట పంచాయితీ గౌరీనగర్‌లో తెలుగు గంగ నీటి సరఫరా చేసే విషయంలో పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా కొన్ని వీధుల్లో నీటి ఎద్దడి ఉంటే మరికొన్ని వీధుల్లో నీళ్ల వృథాగా పోతున్నాయి. గౌరీ నగర్‌లో ఐదు వీధులు ఉన్నాయి. రెండు రోజుల క్రితం వరకు వారం, పది రోజులకు ఒకసారి నీరు సరఫరా చేసేవారు. అప్పుడు ప్రజలు నీటి కోసం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనేవారు. అయితే రెండు రోజుల నుంచి తెలుగు గంగనీరు సరఫరా అవుతోంది. దీంతో సమస్య తీరింది. అయితే పంచాయతీ వారు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతో కొన్ని వీధుల్లో సమస్య అలాగే ఉంది. మరికొన్ని వీధుల్లో నీరు వృథాగా పతోంది. అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకొని అందరికీ నీరు అందేలా చూడాలని గౌరీనగర్ వాసులు కోరుతున్నారు.

గ్రామ బహిష్కరణపపై
అధికారులు జోక్యం చేసుకోవాలి



మాట్లాడుతున్న బాలరాజు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: గ్రామంలో తలపెట్టిన పూజలకు మహిళా సంఘాల నిధులు ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించినందుకు తన కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారని, దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని బాధితుడు, సినీ జానపద గేయ రచయిత బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఏర్పేడు మండలం పరమాలపల్లిలో నివసిస్తున్న తన కుటుంబాన్ని గ్రామానికి చెందిన తొమ్మిది మంది కుట్రపన్ని గ్రామ బహిష్కరణ చేయించారన్నారు. గ్రామంలో దెయ్యాలు తిరుగుతున్నాయన్న నెపంతో నాలుగు వైపులా శక్తిరాళ్ల నాటుకోవ డానికి మహిళా సంఘాల నిధులు వాడుకోవడాన్ని వ్యతిరేకించడంతో తోడబుట్టిన వారిని సైతం తన ఇంటికి రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులు పాలు తెచ్చుకోవడాన్ని కూడా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు పట్టాభి రామయ్య ఊరేగింపు

శ్రీకాళహస్తి, జనవరి 21: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని నెహ్రూ వీధిలో వెలసిన పట్టాభి రామస్వామి ఊరేగింపు సోమవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అయోధ్య మందిరంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని పట్టణంలోని చతుర్మాడా వీధిలో పట్టాభిరామ స్వామి ఉత్సవ మూర్తి ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ హాజరు కావచ్చని తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించండి



డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారి చేయువిదానాన్ని వివరిస్తున్న ఏవో

తొట్టంబేడు, జనవరి 21: ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు పాటించి వ్యవసాయం చేయాలని ఏవో సురేంద్రరెడ్డి సూచించారు. ఫలితంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుందని తెలియజేశారు. మండలంలోని బోనుపల్లి రైతుభరోసా కేంద్రం పరిధిలోని కంచినపల్లిలో రైతులకు డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారి చేసే విధానంపై అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారి చేయడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని వివరించారు.

బోర్ల వద్ద మురుగు తొలగించండి



కేవీబీపురం. జనవరి21: మండలంలోని పాతపాళెం గ్రామంలో తాగునీటి బోర్ల చుట్టూ మురుగు నీరు చేరింది. ఫలితంగా బోర్లలోని తాగునీరు కలుషితమవుతోంది. ఆ నీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులైన స్పందించి మురుగు నీరు తొలగించాలని కోరుతున్నారు.

సీపీఐ నారాయణ సోదరికి నివాళులు



కేవీబీపురం, జన వరి21: మండలం లోని రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు నారా యణ సోదరి ఇంద్రాణెమ్మకు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం ఇంద్రాణెమ్మ కర్మక్రియలు ఆ గ్రామంలో జరిగాయి. టీడీపీ పార్లమెంట్ నాయకులు నరసింహయాదవ్, సత్యవేడు ఇన్‌చార్జి హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత, బీసీసెల్ రాష్ట్ర నాయకుడు మునిస్వామి యాదవ్, శ్రీకాళహస్తి నాయకులు చలపతి నాయుడు తదితరులు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కోడిపందేలపై దాడులు



వరదయ్య పాళెం, జనవరి 21: వరదయ్య పాళెం మం డలం కువ్వాకొల్లి పంచాయతీ ఇసుక పాళెం గ్రామ ంలో కోడిపందేలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహిం చారు. పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,650 నగదు, ఆరు కోళ్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

పట్టించుకోండి సారూ..!

వరదయ్యపాళెం, జనవరి 21: అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ గ్రామాన్ని పట్టించుకోవాలని బత్తలవల్లం పంచాయతీ విరయ్యపాళెం గ్రామస్తులు కోరుతున్నారు. తమ గ్రామంలో రెండు సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని అవి ఎపుడు కూలుతాయోనని వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు తెగి పలుమార్లు వీధుల్లో పడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను సకాలంలో ఆపడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమస్య పరిష్కరించాలని సర్పంచ్, అధికారులను అడుగుతున్నా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అదేవిధంగా గ్రామంలో వాటర్‌ట్యాంకు నిర్మించి రెండు సంవత్సరాలు అవుతున్నా పైపులైను అమర్చ లేదు. దీంతో అది నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లను సరిగ్గా అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం, జనవరి 21: వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పూర్ణకుంభ స్వాగతం పలికి సన్మానించారు. హిందీ పండితులు మునస్వామి, ఆంగ్ల ఉపాధ్యాయులు రసూల్ సాహెబ్, డ్రాయింగ్ మాస్టర్ ఏవీవీ సత్యనారాయణ, డ్రిల్ మాస్టర్ మునీంద్రయ్య, గణిత ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సైన్స్ ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యార్థులు ఆ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు నాగప్రసాద్, వీరభద్రయ్య, మురగయ్య, రాకేష్, గణేష్, సుమారు 70 మందికి పైగా పాల్గొన్నారు.

అయోధ్య రాముడిపై కవిత



టీచర్ బాలసుబ్రమణ్యం

తొట్టంబేడు, జనవరి 21: అయోధ్య రామమందిరం నిర్మాణం సందర్భంగా మహతి సాహితీ కవి సంగమం సంస్థ అయోధ్య రాముడికి అనంత కవితార్చన కార్యక్రమం చేపట్టింది. ఇందులో రామునిపై వంద కవితల సంకలనం పుస్తకం ఆవిష్కరించింది. ఈ కవితా సంకలనంలో మండలంలోని దిగువసాంబయ్య పాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కయ్యూరి బాలసుబ్రమణ్యం రాసిన కవితకు చోటు లబించింది. దీంతో ఆయనకు పోస్టు ద్వారా ప్రసంసా పత్రం అందజేశారు.

వైసీపీ నాయకులపై
చర్యలు తీసుకోవాలి

రేణిగుంట, జనవరి 21: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో అధికార వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీడీపీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబుబ్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. శ్రీకాళహస్తిలో టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి పర్యటనపై వైసీపీ వారు దాడికి ప్రయత్నించడంపై ఆయన మండిపడ్డారు. దౌర్జన్యానికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

శ్రీకాళహస్తి, జనవరి 21: మృతుల కుటుంబాలను మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ పరామర్శించారు. ఆదివారం శ్రీకాళహస్తి పట్టణం 25వ వార్డు చెందిన రేణుకమ్మ, ఎనిమిదో వార్డుకు చెందిన సయ్యద్ బాష మృతి చెందారు. వారి మృతదేహాలకు బృందమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు భవిత

వరదయ్యపాళెం, జనవరి 21: టీడీపీతోనే బీసీలకు భవిత అని తిరుపతి పార్లమెంటు అధ్యక్షులునరసింహయాదవ్ అన్నారు. వరదయ్యపాళెంలో ఆదివారం జయహో బీసీ సభ టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హెలెన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి నరసింహయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీలకు అన్యాయం చేశారన్నారు. వారిని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బీసీలకు అత్యున్నత పదవులు ఇచ్చింది టీడీపీ అని గుర్తుచేశారు. ప్రస్తుతం వచ్చేఎన్నికల్లో వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం హెలెన్ మాట్లాడుతూ మండలంలో బీసీలకు సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరంధాం, బాలసుందరం, నిర్మల్‌కుమార్, అజయ్, నాగరాజుయాదవ్, దశరథయ్య, వరలక్ష్మి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.





అధ్వానంగా ఉన్న ప్రధాన రోడ్డు

దక్షిణకైలాస్ నగర్ కాలనీలో సమస్యల తిష్ట

శ్రీకాళహస్తి, జనవరి 21: శ్రీకాళహస్తిలోని దక్షిణకైలాస నగర్ కాలనీలో ప్రజా సమస్యలు తిష్ట వేశాయి. పట్టణంలో 9వార్డు పరిధిలో ఈ కాలనీ ఉంది. ప్రభుత్వాస్పత్రి ఎదురుగా సుమారు 22ఏళ్ల క్రితం ఈ కాలనీ ఏర్పడింది. వెయ్యికి పైగా నివాస గృహాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నత వర్గాల ప్రజలు ఇక్కడ అధికంగా స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. కాలనీలో దాదాపు అన్నీ బహుళ అంతస్తుల భవనాలే. కానీ కనీస సౌకర్యాలు కాలనీలో లేవు. కాలనీ ప్రధాన రోడ్డు రాళ్లు తేలి గుంతలమయంగా దర్శనమిస్తోంది. నిత్యం వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. కాలనీలో సబ్ రోడ్లు అన్నీ మట్టిరోడ్లే. వర్షం పడితే బురదమయంగా మారుతున్నాయి. ఇక్కడ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు కాలేదు. దీంతో మురుగు, వ్యర్థాలు ఇళ్ల మధ్యనే రోజులతరబడి నిలిచిపోతున్నాయి. దోమలు, దుర్గంధం నడుమ జనం జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి తమ ప్రాంతానికి కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కాలనీలోని మట్టి రోడ్లు

టీడీపీలోకి 40 వైసీపీ కుటుంబాలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న హెలెన్

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 21: బుచ్చినాయుడుకండ్రిగ మండలం కొత్తపాళెం పంచాయతీలో టీడీపీ, యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం విజేతలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి 40 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి హెలెన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్నయ్య నాయుడు, మనోహర్‌నాయుడు, రమణయ్యయాదవ్, వీరరాఘవులు, సత్యం, ఆదిశేషయ్య, దామా మునెయ్య, హరినాథరెడ్డి, రమేష్, వెంకటేష్, కేశవులు నాయుడు, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెలెన్

నాలుగేళ్లుగా ముందుకు సాగని తహనగర్ రోడ్డు

- బిల్లులు రాక పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రాళ్లు తేలిన తహనగర్ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 21: మండలంలోని తహనగర్ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. 2019లో జంబుగోళం రోడ్డు నుంచి తహనగర్‌కు రూ.1.32 కోట్లు అధికారులు మంజూరు చేశారు. జంబుగోళం రోడ్డు నుంచి పూసలపల్లి, దండోడుకండ్రిగ, తహనగర్ వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మొదట్లో పనులను కాంట్రాక్టర్ వేగంగానే చేశారు. అయితే బిల్లులు రాకపోవడంతో రోడ్డుకు మెటల్ పరిచి కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. మెటల్ క్రమేపీ లేచిపోవడంతో ఈ మూడు గ్రామాల ప్రజలు రోడ్డులో ప్రయాణిచంలేక ఇబ్బందులు పడు తున్నారు. విద్యార్థులు, వృద్ధులు ఈ రోడ్డులో ప్రయాణించలేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలు ధపాలుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని కోరుతున్నారు.

బీఎన్‌కండ్రిగలో వీధి కుక్కల బెడద



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 21: బుచ్చినాయుడుకండ్రిగలో వీధి కుక్కలతో ప్రజలు బంబేలెత్తిపోతున్నారు. మండల కేంద్రంలో అధిక శాతం వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. మూడు ప్రభుత్వ వసతి గృహాలు ఉండటంతో వాటి చుట్టూ పడవేసే అన్నం కోసం పోటీపడుతుంటాయి. అంతేగాక చికెన్, మటన్ దుకాణాల వద్ద కుక్కలు గుంపులు ఎక్కువగా ఉంటున్నాయి. అక్కడి వ్యర్థాల కోసం ఆరాటపడే క్రమంలో ఘర్షణ పడుతూ రాకపోకలు సాగించే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. ఆట స్థలం దగ్గర ఉదయం పూట వాకింగ్ చేస్తున్న వారిపై దాడులకు దిగుతున్నాయి. గ్రామంలో ఇటీవల ఓ చిన్నారిని, ముగ్గురు మహిళలను గాయపరిచాయి. పది రోజులు క్రితం ఓ పిచ్చికుక్క ముగ్గురిని, ఒక ఆవును గాయపరిచింది. వీరంతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేసుకున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పలువురు కోరుతున్నారు.

నిత్యావసరాల వితరణ



శ్రీకాళహస్తి, జనవరి 21: శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగకు చెందిన కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్ర మణ్యం ఆదివారం పరామర్శించారు. నిత్యా వసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్ల తాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, రత్నంరెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఆర్వీకండ్రిగలో ఇటీవల మృతిచెందిన రాణెమ్మ కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సబ్రహ్మణ్యం పరామర్శించారు. ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు.

కులగణనకు సర్వర్ చిక్కులు

వరదయ్యపాళెం: మండలంలో కులగణనకు సర్వర్ చిక్కులు ఎదురవుతున్నాయి. ఆదివారం గంగమిట్టలో కులగణన కోసం ఒక్కొకరి వద్ద సుమారు గంటకుపైగా సమయంతీసుకుంటోంది. ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్రికెట్ విజేత చిందేపల్లి

ఏర్పేడు: చిందేపల్లి గ్రామంలోని సిద్ధేశ్వర్వాలయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామంలో 15 రోజుల నుంచి జరిగిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ 40 జట్లు పాల్గొనగా విజేతగా చిందేపల్లి నిలిచిందన్నారు. విజేతకు రూ.12వేలు, రన్నరప్‌కు రూ.6వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, ఢిల్లీ, చెంచురామ్, తిరుమల, గోపాల్, లోకేష్ పాల్గొన్నారు.

బంగారు కాసు అప్పగింత



శ్రీకాళహస్తి, జనవరి 21: భక్తురాలు జారవిడుచుకున్న బంగారం కాసును ముక్కంటి ఆలయ ఉద్యోగులు తిరిగి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన దంపతులు ఆదివారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. క్యూలైన్‌లో మహిళ మంగళ సూత్రంలోని బంగారం కాసు వీడి కింద పడిపోయింది. ఇది గుర్తించిన ఓ పారిశుధ్య కార్మికురాలు ఎస్పీఎఫ్ పోలీసులకు అప్పగించారు. కాసేపటి తర్వాత సరైన ఆధారాలను వివరించిన భక్తురాలికి అందజేశారు.

ముఖ హాజరుకు కసరత్తు

శ్రీకాళహస్తి, జనవరి 21: ముక్కంటి ఆలయ సిబ్బంది ముఖ హాజరు నమోదు చేసేలా ఆదివారం కసరత్తు చేశారు. ఆలయంలోని కార్యాలయ, నందనవనం, వాచ్ అండ్ వార్డ్ విభాగాల సిబ్బంది వివరాలను నమోదు చేశారు. ఇకపై మొబైల్ యాప్ ద్వారా వారు ముఖ హాజరు నమోదు చేసేలా సూచనలు చేశారు.

తప్పిపోయిన వృద్ధుడు



టీబీ పటేల్

శ్రీకాళహస్తి, జనవరి 21: కర్ణాటకకు చెందిన టీబీ పటేల్ అనే వృద్ధుడు శ్రీకాళహస్తిలో తప్పిపోయారు. కుటుంబ సభ్యులను వెతుక్కుంటూ వృద్ధుడు ఆదివారం రాత్రి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద తారసపడ్డాడు. ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు ఆరా తీయడంతో కర్ణాటకకు చెందిన టీబీ పటేల్‌గా తెలిపాడు. ముక్కంటి ఆలయ దర్శనానికి కుటుంబ సభ్యులతో పాటు వచ్చానని వారి జాడ కోసం తిరుగుతున్నట్లు వెల్లడించారు. అనంతరం అంబులెన్స్ నిర్వాహకులు తప్పిపోయిన ఆయన్ను 1టౌన్ పోలీసులకు అప్పగించారు.

నేడు సత్యవేడు మండల సమావేశం

సత్యవేడు, జనవరి 21: సత్యవేడు మండల సమావేశం సోమవారం జరగనుందని ఎంపీడీవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ప్రతిమ సుశీల అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

గుంతలమయం
బహదూర్ పేట రోడ్డు

శ్రీకాళహస్తి, జనవరి 21: శ్రీకాళహస్తిలోని బహదూర్ పేట రోడ్డు గుంతల మయంగా దర్శనమిస్తోంది. శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం నుంచి నల్లగంగమ్మ ఆలయం వరకూ గతంలో రోడ్డు అధ్వానంగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సిమెంటు రోడ్డు నిర్మించారు. అయితే ఏడాది క్రితం ఓ ప్రైవేట్ టెలికాం సంస్థ తమ భూగర్భ కేబుల్ విస్తరణ కోసం ఈ రోడ్డుపై ఎక్కడ బడితే అక్కడ గుంతలు తవ్వేసింది. పని పూర్తయిన తర్వాత కనీసం గుంతలకు మరమ్మతులు చేయకుండా వదిలేసింది. అధికారులు స్పందించి బహదూర్ పేట రోడ్డుపై గుంతలను బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



త్రిశూలంబ కూడలి వద్ద గుంతల రోడ్డు

200మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, జనవరి 21: ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు గ్రామంలో ఆదివారం సుమారు 200 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువనాయకులు సురేష్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున యువత వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే మార్కెట్ యార్డు డైరెక్టర్, వైసీపీ మండల ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యంయాదవ్‌తో పాటు ఆయన ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఎండీ పుత్తూరు పంచాయతీ మిట్టఇండ్లు వద్ద సుమారు 200 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో మోహనలాల్ యాదవ్, సాయి యాదవ్, అశోక్‌య, వంశీ, మహేష్, విజయ్, సతీష్, వినయ్, సుధీర్, చైతు, మురళి, శశి, రోహిత్, వాసు, శరత్ కుమార్, ప్రతాప్, మునితేజ తదితరులు ఉన్నారు. కాగా ఎండీ పుత్తూరు ఎమ్మెల్యే మధు సూదన్‌రెడ్డి చిన్నమ్మ కుమారుడైన కిషోర్‌రెడ్డి స్వగ్రామం కావడం గమనార్హం.

- మడిబాక పంచాయతీలోనూ 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమం జరి గింది. రాజుల కండ్రిగకు చెందిన వైసీపీ నాయకులు శంకర్‌రాజు, ఈశ్వర్ రాజు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

70రోజుల్లో సీఎం చంద్రబాబు

రానున్న 70 రోజుల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు ఎండీపుత్తూరు గ్రామంలో నిర్వహించిన ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు పొన్నారావు, చిరంజీవులు నాయుడు, మనోహర్ నాయుడు, అంకయ్య, నాగరాజునాయుడు, సూరినాయుడు, మాజీ ఎంపీపీ నాగరాణి పాల్గొన్నారు.